# పీరాస్వామి

మధ్యాహ్నం మూడుగంటల దాయల్న ఆ వూరిబయట రోడ్డుపక్కనే వున్న రామయ్యగారింటి వీధి తలుపు తెరిచి, సళ్ళొదిలిన కండలు, లోతుకుపోయిన దవడలు, నెరిసి వాలిన బొద్దుమీసాలు, నెత్తిన పొగాకు పట్టా, చేతిలో వెదురు కర్ర, పొట్టిగా పీరాస్వామి తొంగిచూశాడు.

ఎండ తగ్గనందుకు కావాల్ను రామయ్య గారింటో జనం ఎవరూ యింకా బయటపళ్ళేదు. ఇంటిముందర ఖాళీస్తలంలో అక్కడక్కడ ఎండిన పచ్చిగడ్డి తుప్పలు, పక్కకు వొరిగి పడేట్టున్న ఓ మాలతి, మల్లెపందిళ్ళు, వీధివాకిలికి కుడిపక్క గొడ్లసావిడి, ఎడంపక్క సపోటా చెట్టుదగ్గిర వరలబావి, పక్కనే కొబ్బర్నార తాడుగట్టిన రేకుబొక్కెన పీరాస్వామి కంటపడ్డయ్.

వరలబావి నీళ్ళతో, వేడి చెవటలు కక్కుతున్న తెల్లటి మీసాలూ, తలతోపాటు కాళ్ళూచేతులు కడుక్కుని, కడుపుకు తాగినన్ని నీళ్ళు తాగి, సపోటా చెట్టుకిందకొచ్చి పై పంచతో వొళ్ళు తుడుచుకుంటూ చల్లగా కూచున్నాడు పీరాస్వామి.

పొగాకు పట్టాలోంచి ఓ చిన్న తుంపు నోట్లోవేసుకుని, రామయ్యగారి యింటిజనం బయటికొచ్చేదాకా అక్కడే కాసేపు కూచుందామనుకున్న పీరాస్వామికి చెట్టున పండిరాలిన సపోటాపండు నదరుగా కంటపడింది.

చురచుర మంటున్న ఎండలో దిమ్మతిరిగి, అలసిపోయి, చమటలు కక్కుతూ కడుపు మంటతో చల్లపట్టుకొచ్చి పడిన ప్రాణి కంటెదుట అట్టానున్నగా సపోటాపండు పడివున్నదంటే ఆ ప్రాణి ఒళ్లు ఎట్టా కదలబారి నోరే రకంగా నీరు కారుస్తుందో తెలుసుకోటం అంత కష్టం కాదు.

నరాల సళ్ళొదిలి, అనుకోకుండానే పండు దగ్గిరకు చాచుకున్న పీరాస్వామి చెయి పండును పట్టుకోకుండానే ఆగిపోయింది.

ఆ పండు నెందుకు తినాలి? తను యీ యింట్లో జీతగాడుగా పనిచేసి రామయ్యగారితో మాటకు మాటొచ్చి సరిపడక పనిమానుకుని వెళ్ళిపోయినాడు. ఇప్పుడింటివారు చూడకుండా తనాపండుకోసం కక్కుర్తిపడ్తే బతికున్నన్నాళ్ల తనకు లోపల తొలుస్తూనే ఉంటుంది.

సపోటాపండు మీదనుంచి చూపుమళ్లించి మెల్లిగా తనచుట్టూ చూశాడు పీరాస్వామి. ఇంటో ఇంకా ఎవరూ కదుల్తున్నట్టు చప్పుడు వినిపించటంలేదు.

ఆ ఎర్రపెంకల డాబా గోడలమీద వీరాస్వామి చూపు నిలిచింది. గోడల మీద అక్కడక్కడ నెర్రెలున్నయ్. రెండు పెద్దనెర్రెల్లో మర్రి, నేరేడు మొక్కలు కనుపించినై వీరాస్వామికి. ఆ విధంగా గోడల్లో మొక్కలు మొలవటం ఆ యింటి కంత మంచిది కాదనుకున్నాడు వీరాస్వామి.

అవి దొంతరమల్లెంటు. ఎన్నిపూలున్నయ్? వెనక రామయ్యగారి కోసం ఏటవతల ఎద్దుల బేరానికి వెళ్ళినప్పుడు తను పది పన్నెండు దొంతర మల్లెంట్లు తెచ్చి నాటాడు. వాటిలో యిప్పుడా ఒక్క మల్లెంటే మిగిలి బాగా పెద్దదయింది. మీద పల్చగా వేసిన వెదురుబద్దల పందిరి సహం పడిపోయి రెండుమూడు వెదురు బద్దలు మల్లెకుదుట్లో పడున్నయ్.

గొడ్ల సావిట్లో ఒక బర్రెగొడ్డు, దూడ పడుకొని నెమరేస్తున్నయ్. రెండు చెడిపోయిన గాదెలు, ఓ కోడు పోయిన కొట్టుడు బల్ల, చుట్టు చట్రంతో మూడాకులుపోయిన బండిచక్రం, ఓ పిడకల కుప్ప, యింకొంత చెత్తాచెదారం వున్నా గొడ్ల సావిట్లో ఎక్కువ భాగం ఖాళీగానే వుంది. ఆ గొడ్ల సావిడిలో రెండు కుమ్మరి గిత్తలు, బారెడు బారెడు కొమ్ములున్న రెండు గవిడిబర్రెలు, ఒకావు, పెయ్యదూడా వుండేవి, వీరాస్వామి రామయ్యగారి జీతం మానుకు వెళ్ళేప్పుడు.

రామయ్యగారి స్థితి పడిపోయిందని తను వింటున్నాడేగాని ప్రత్యక్షంగా చూడలేదు.

ఇప్పటివరకు నెమరేస్తూ పడుకున్న బర్రెగొడ్డు లేచి వీరాస్వామి వేపు చూసింది. గొడ్డుకు నీళ్ళుపెట్టే వేళయిందనుకున్నాడు వీరాస్వామి. ఆ బర్రెగొడ్డుకు బారెడు కొమ్ములున్నయ్ అది వెనకటి గవిడిబర్రెల తాలూకు పడ్డే. ఎవరో తోస్తున్నట్టు లేచి సావిడికి కొంచెం బయటగావున్న గాబు దగ్గిరకెళ్ళి చూశాడు వీరాస్వామి. గాబులో నీళ్ళు లేవు. ఆ రాతిగాబు వెనుక తనున్నప్పుడున్న గాబే. ఏం మారకుండా అట్టాగే వుంది. ఈ గాబుదగ్గిరే తనకూ రామయ్యగారికి తగవొచ్చి తను జీతం మానుకుపోయింది!

ఆ రోజు తను ఎర్రగిత్తకు కుడితి తాపుతున్నాడు. ఎర్రగిత్త చెడ్డపొగరు మోతుది. దాన్ని తను గాబుదగ్గిర కట్టేశాడేగాని కుడితి ముట్టనే లేదది. అది రుచి మరిగిన గిత్త కుడితిమీద తవుడు తేలాడుతుంటేగాని కుడితి లోపలికి దిగదా గిత్తకు. అది రామయ్యగారు చేసిన అలవాటు. గిత్తమీద ముద్దుకొద్దీ అవి కుడితి తాగుతుంటే- పంచదారో- వుప్పో- కారమో చల్లినట్లు- పొడితవుడు చల్లుతుండే వాడు రామయ్యగారు. తెల్లవారి లేచే ఆ గిత్తల పేడ, రొచ్చు బాగుచేసి, వాటికి

సిబ్బా గడ్డిపెట్టి, ఉండిపసులకు వాటిని అదుపులో పెడ్తున్నది తనుగదా? అటు వంటప్పుడు చెబితే మాట వినాల్సిన గిత్తలకు రామయ్యగారు విడిగా ముదనష్టపు అలవాటు చేయటం తనకు గిట్టలేదు. అందుకే తనానాడు అడుగున పేరుకున్న తప్పుకుని కలుపుదామని గాబుదగ్గిర కెళ్ళి యిట్టే వారిగేసరికి ఎఱ్ఱగిత్త డొక్కలో కుమ్మిన కుమ్మటం ఉమ్మడిరిగి అయిదారు బారల దూరానికెళ్ళి పడ్డాడు తను. అయినా తను లేచి పక్కనే పగలేసేందుకు పడేసిన సరివికట్టె నోటి తీసుకుని ఎఱ్ఱగిత్తను నడుంపుగా ఒకటి బాదేసరికి అది పలుపు కాస్తా తెంపుకొని, నాలుగరటి చెట్లను, వంగా, బెండా, పొట్లా, పొరపాదు అన్నిట్నీ యిరగదొక్కి బజార్లో పడింది.

తనప్పుడు తెప్పరిల్లుకొని ఒళ్ళు దులుపుకుంటున్నాడు. అప్పుడు బజారు వాకిట్లోంచి విరుచుకుపడ్డ రామయ్యగారు అరటిచెట్లను, చెట్లపాదుల్నీ చూపుచూసి, పుసిగా వచ్చిన రావటం పక్కనే పడున్న ఆ సరివి కట్టెనే తీసుకొని తన తల మీద ఫెడీమని బాదాడు! ఆ దెబ్బ బరువుకు కింద కట్టాగే అడుసుకుపోయినా, తలగుడ్డ వుంటంవల్ల తనానాడు బతికిపోయినాడు.

ఏనాడు పల్లెత్తు మాటపడని తనను ఆనాడు రామయ్యగారు జరిగింది తెలవకుండా తనను గొడ్డును బాదినట్టు బాదాడు.

"ఎవరా నుంచుందీ?"

పులిక్కిపడి వెనక్కుతిరిగి రామయ్యగారి పెళ్ళాం వెంకటసుబ్బమ్మ అక్కడ నుంచునుంటం చూశాడు వీరాస్వామి.

"నువా వీరాస్వామీ! చప్పునచూసి పోల్చుకోలేక పొయ్యాను! ఎన్నేళ్ళయింది నిన్నుచూసి!" అంది వెంకటసుబ్బమ్మ.

"పొనుగూరు పుగాకు బేరం చేసుకుంటానికెళ్ళి తిరిగొస్తా తమనోసారి చూసెళ్దామని యీడ అట్ట కూసేపు కూకున్నానో లేదో తమరొచ్చారు. అంతా బాగుండా రమ్మగారూ?" అన్నాడు వీరాస్వామి.

"ఏదో వున్నాం ఆట్లా. నువు ఒంగోల్నుంచి మనవూరు తిరిగొచ్చి చుట్టుపక్క వూళ్ళలో పొగాకుబేరం చేసుకుంటున్నావని మీ అయ్యగారోసారి చెప్పారు. కాని నువుమటుకు కనుపించనేలేదు. నువు మాయింట్లో జీతానికి మానుకుని పోవటం మళ్ళీ యిదేగా రావటం వీరాస్వామీ? చూశావా మా యింటి అవతారం ఎట్లా వుందో? నువు మాదగ్గిర జీతానికున్న రోజుల్లో యీ యిల్లెంత కళగావుండేది! చూశావా వీరాస్వామీ నాకిట్టా కునుకు పట్టిందో లేదో మీ అయ్యగారు వీధి తలుపు

బార్లగా తెరిచి పూళ్ళోకి పోయినారు! నువు కాబట్టి సరిపోయిందిగాని పరాయివాళ్ళెవరైనా వచ్చి ఏ తాడో పేడో చంకన పెట్టుకుపోతే మన బతుకెక్కంత కావాలో చెప్పు? మీ అయ్యగారికి యిల్లంటే యీనాటికీ శ్రద్ధలేదు." అంది వెంకట సుబ్బమ్మ.

"మన పెద్దబ్బాయి గోపాలంగా రెక్కడున్నా రమ్మగారూ? ఆయన సెన్నాపట్టంలో పెద్ద చదువులు చదివారని విన్నా. పెళ్లి చేశారా?" అనడిగాడు వీరాస్వామి.

"వాడి పిండ కూడు! పెళ్లాన్నొదిలేసి బైరాగి పక్షల్లే తిరుగుతున్నాడు. అవును. వాడంటే సీకెతో ప్రాణం పాపం! వాణ్ణి చిన్నతనంలో ఎప్పుడూ ఎత్తుకు తిప్పుతూ కిందికి దించేవాడివి కాదు! వాడు పెద్దయినాక కలకటేరవుతాడంటుండేవాడివి జ్ఞాపకం వుందా వీరాస్వామీ?" అంది వెంకటసుబ్బమ్మ.

"పెద్దబ్బాయిగారి మొగమెప్పుడూ కళగా వుండేది" అన్నాడు వీరాస్వామి.

"మండింది! పిల్లల చిన్నప్పటి మొహాలు పెద్దయినాక మార్తాయి వీరాస్వామీ! నా కొడుకును గురించి నేను చెడుగా చెప్పుకో గూడదుగానీ పెద్దవాడైనాక గోపాలం వుత్త భ్రష్టుడైనాడు! వాడు రాసినంత డబ్బు పంపిస్తూ పట్నంలో ఎంత పెద్ద చదువులు చెప్పించామో వాడికా చదువులంత విషంగా మారినై! మీ అయ్యగార్ని నిలవేసి భాగం పంచుకెళ్లి సెంట్ల వ్యాపారమనీ, సినిమాహాలు కట్టిస్తాననీ, వీడిపిండాకూడనీ డబ్బంతా తగలేసి ఫాన్సీడ్రింకు షాపని గుంటూరు నడిబజార్లో దుకాణ మోటి పెట్టుకుని వూరేగుతున్నాడు. వాడింత అధోగతికి దిగజార్తాడని మేం కల్లోగూడా అనుకోలేదు!" అంది వెంకట సుబ్బమ్మ.

"నిజానికి ఎప్పుడేమనుషులు ఎట్టమార్తారో మనకి తెలియదమ్మగారూ! రేపు వున్నట్టుండి గోపాలంగారు ఆడింకుల యాపారంలో ఒకరెండు లక్షలు సంపాయించాడంటే దారే పొయ్యేజనం ఆయనచుట్టూ తిరగటం అట్టావుంచి ఆ వూపుమీదే ఏ ఓట్లలోనో గెలిచి మంత్రిగారయ్యారంటే యింకా గోపాలంగారంత గొప్పోడుండడు! నేను ఒంగోల్లో ఆవుల బేరాలు కుదిర్చి నాలుగుడబ్బులు సంపాయించుకుంటున్నప్పుడు ఓ చిన్న కోమటి దుకాణం ఆయన కొడుకు కొందరు తెల్లదొరల్తో పరిసియం సేసుకుని తెల్లోరిదేశాలకు చచ్చుల్లిపాయలు సరఫరాచేసి గుట్టుచప్పుడుగా మూడులక్షలు సంపాయించి ఓ సినిమాహాలు కట్టుక్కూచున్నాడు! యీనాడు చదువుకున్నారెప్పుడో చాటుకు పోయినారమ్మగారూ."

అన్నాడు వీరాస్వామి.

"సరేగా యీ భ్రాంతులే గోపాలానికున్నయ్. కాని ఆ విధంగా పెరుచుకు పడే సొమ్ము పాపిష్టిది వీరాస్వామీ! అది సుఖాన్నిచ్చే సొమ్ముకాదు. మాది పూర్వులు కష్టపడి ఆర్జించిన సుక్షేత్రమైన భూమి. గోపాలం ముప్పాతిక కర్చు పెట్టాడు. లక్ష్మి పెళ్ళికి పడిపోనపోలయింది. చిన్నవాళ్ళు నాగులు, సుబ్బుల గతేమవుతుందో తెలియదు. మీ అయ్యగారిస్థితి దిగజారిపోయింది వీరాస్వామీ." అంది వెంకటసుబ్బమ్మ దిగులుతో కుంగిపోతూ.

"బర్రెగొడ్డుకు నీలయాలయినట్టుంది కడవుంటే యివ్వండమ్మగారూ గాబులో రెండు కడవలు పోసిపోతాను." అన్నాడు వీరాస్వామి సుబ్బమ్మ ధోరణి తిప్పుతూ.

"ఒద్దులే వీరాస్వామీ. వెనకటి ప్రేమ నీకింకా మిగిలిందిగనక ఆ మాట న్నావు. అంతేచాలు. యివాళ నువు నాకు చేసిపెట్టినందువల్ల రేపు నాకు తప్పు తుంది గనకనా! నీ పెళ్ళాం బిడ్డలు బాగున్నారా వీరాస్వామీ? నీ పెద్దకొడుకు రాఘవులకు మేనత్త కూతుర్నే యిచ్చారట నిజమేనా? ఇక్కడే వున్నారా కొడుకూ కోడలూ?" అనడిగింది వెంకటసుబ్బమ్మ.

"రాగవులు బెజవాడలో అదో ఫ్యాక్టరీలో పిట్టరుగా అరవై రూపాయలకు పుద్యోగం చేసుకుంటున్నా డమ్మగారూ. కోడలక్కడే వుంది" అన్నాడు వీరాస్వామి.

"నిజంగానా వీరాస్వామీ? ఎంత ప్రయోజకుడైనాడు రాఘవులు! మా గోపాలం యీడువాడు!" అంటున్నది వెంకటసుబ్బమ్మ.

"రామయబావ లేడమ్మా వెంకటసుబ్బమ్మా! నే నిప్పుడే బెజవాణ్ణుంచి వస్తున్నాలే. సాయంకాలం బాపట్ల వెళ్ళాలి. రామయబావతో తొందర పనుండొచ్చా, యింట్లో లేడూ? అయితే! ఈ రామయ్యకు యింట్లోకూడా ఒక్క నిమిషం కాలానేట్టుగా లేదే! ఎవరదీ? ఓరి నువ్వ్రటా వీరాస్వామీ! ఎవరో ననుకున్నానూ! చూసి చాలారోజులయిందిలే! పొగాకు లైసెన్సు తీసుకుని బేరంచేస్తున్నావటగా? యీ వీరాస్వామి వెనక మీయింటో జీతానికుండేవాడు కాదు వెంకటసుబ్బమ్మా? నీ కొడుకు రాఘవులు బెజవాడలో జయ్ వీరహనుమాన్ ఫ్యాక్టరీలో పనిచేస్తు న్నాడు గాదుటా వీరాస్వామీ?" అంటూ వెండి ముక్కద్దాలో, వేలుముడీ, బూడిదరంగు కోటూ, చంకలో గొడుగుతో వీధివాకిట్లోంచి తోసుకొచ్చిన ఆవూరు షావుకారు రంగయ్య దడదడ మాట్లాడాడు.

"ఆ ఒరేయ్ తీసేసి నన్నువుత్త వీరాస్వామని పిలవండి, చాలు" అన్నాడు వీరాస్వామి రంగయ్యానో చూపుచూసి.

"చూశావా వెంకటసుబ్బమ్మా? నోరువిప్పి మాట్లాడేచాలు ఫెడీమని నోటి మీద కొట్టేట్టున్నారు యిదిగో యీ రకమంతా. యీయనగారికొడుకు బెజవాడలో తటస్థ తేకిప చీంమ చెండటూ చెప్పొచ్చానో లేదో యిదిగో యిదీవరస! యీయనగారి కొడుకు ఆ జై వీరహనుమాన్ ఫ్యాక్టరీలో ఓ పెద్ద సమ్మె నాయకుడూ! ఆఫ్యాక్టరీ ప్రొప్రయిటరు నా మేనత్త కొడుకు బావమరిది కూర్మావతారం అయితే చూడబోయినా. అదుగో అక్కడ యీయనగారి కుమారుడు పెద్ద సమ్మె లేవదీసి జీతాలు పెంచుతావా చస్తావా అని– పేద్ద డిమాండు పెట్టికూచున్నాట్టా–అ పోలీసులు కాస్తా వచ్చి యీ రాఘవులు ముఠాను జైల్లోకుక్కి రోగం కుదిర్చారు! యింతకీ వాడసలు కమ్యూనిస్టు!" అన్నాడు రంగయ్య, వీరాస్వామిని ఎగాదిగా ముక్కద్దాల్లోంచి చూస్తూ.

"కడవ యియ్యండమ్మగారూ, గాబులో నీలుపోసి పోతాను." అన్నాడు వీరాస్వామి రంగయ్యానో పురుగును దులిపేసినట్టు దులిపేసుకుంటూ.

"నిక్షేపంగా వుద్యోగం చేసుకుంటున్నాడనుకుంటే యిదేం ఖర్మ వీరాస్వామీ? వెంటనే వెళ్ళి వాణ్ణి నాలుగు చివాట్లుపెట్టి ఏదైనా సర్దుబాటుచేసిరా వీరాస్వామీ" అంది వెంకటసుబ్బమ్మ.

"నేను అన్నీ కనుక్కున్నాగా! వుత్తచివాట్లేం లాభంలేదు. కొడుకుచేత క్షమాపణ చెప్పిస్తే జైల్లోంచి విడుదల చేస్తారటకూడా!" అన్నాడు రంగయ్య.

"ఎందుకు క్షమాపణ చెప్పకోడం? నేను చాకిరి చేసినన్నాళ్ళూ నాకు జరిగిన అన్యాయానికి నా జన్మలో నేను నోరెత్తి మాట్లాళ్ళా. రాఘవులు నాయం కోసం పబ్లీగ్గా నోరుతెరిసడుగుతుండాడు. యిందులో తప్పేముంది క్షమాపణ చెప్పుకుంటానికి?" అన్నాడు వీరాస్వామి.

ఆ రాత్రి వెంకటసుబ్బమ్మకు కల్లో రాఘవులు బుజాన చేయివేసి, నెరిసి వాలిన బొద్దుమీసాలూ, లోతుకుపోయిన దవడలూ, నెత్తిన పొగాకుపట్టా, యింకో చేతిలో వెదురుకర్రతో పొట్టిగా నుంచున్న వీరాస్వామి కనపించాడు.

(అభ్యుదయ, 1956 మే)